దీపావళి కథలపోటీలో రు.700/- బహుమతి పొందిన కథ

మాయ

"సుఖము కొరకు కోరిక జనించును. కోరిక నుండియే విరక్తి కలుగును. విరక్తి నుండి మరల కోరిక జనించును. ఇది యొక మాయ"

★ ★ ★ ★ ★ ★ ★

"ఉద్ధతుల మధ్య పేదల కుండతరమె?" తనలో తానే సన్నగా అనుకున్నాడు వంశీ. అతని దృష్టి ఎదుటి సీటులో కూర్చున్న అమ్మాయి మీద ఉంది.

కిటికీలోంచి వస్తున్నగాలికి ఎగిరిపోతున్న ఆమె పయ్యెద మీద ఉంది. 'బతుకొని పోవు కటిక చో ద్వృత్తి నడుమ ఎచటికో తొలగిపోయిన, ఆ తరుణి తను మధ్యం' మీద ఉంది.

ఆమె సుమ.

వంశీ ఆఫీసులో నే ఆమె ఆరునెలలుగా పనిచేస్తోంది. ఆమె రాక మునుపు లేని చైతన్యం ఆమెతో ఆ ఆఫీసుకి వచ్చింది. ఆమెతో పాటు ఆ ఆఫీసులో ఆర్గురు ఆడవాళ్ళున్నారు. కాని అందరి దృష్టి ఆమె మీద పడింది.

ఆమెకు, దగ్గరవటాన్కి ప్రతివాడూ ప్రయత్నించసాగాడు. వంశీ కొంచెం ఎక్కువగా అనవసర ప్రసంగాలు ఆమెతో ఎన్నో చేసాడు. ఎన్నిసార్లు మాట్లాడినా ఆమెతో 'తన' విషయం చెప్పడం అవలేదు. అతని మీద ఆమె అభిప్రాయం తెలియలేదు.

వంశీ అందగాడు.ఈ 'వనితా మానస సూనసాయ కుడు'. సహజంగానే అతని దృష్టి ఆమెమీద నిలిచింది. ఆమెను చూశాక అతనికి ఇంకెవ్వరూ నచ్చలేదు.

చెయ్యి పైకెత్తి బల్బు వెలుగులో టైమ్ చూసు కున్నాడు వంశీ. పదిన్నర దాటింది. "ఇంకో గంట ప్రయాణం" అనుకున్నాడు.

పుష్పలోయ వెళ్తోందా బస్సు.

పుష్పలోయ అన్నది లోయ కాదు కాని, అక్కడ ఎక్కువగా పూలు పూయటంతో ఆప్రదేశానికా పేరు వచ్చింది. అదొక మంచి పిక్నిక్ స్పాట్. చాలామంది దూరప్రదేశాల నుంచి కూడా అక్కడికి వెళ్తుంటారు పిక్నిక్‌కి. కార్తీకమాసంలో, పిక్నిక్‌కి ఎక్కడికి వెళ్లాలన్న ప్రశ్న వచ్చినపుడు, ఆఫీసులో చాలామంది అక్కడికేవెళ్దామన్నారు. కాని కొంతమంది, ముఖ్యంగా వయస్సు మళ్లినవాళ్ళు అభ్యంతరం చెప్పారు. కారణం, అక్కడికి వెళ్లాలంటే ఘాట్ రోడ్డు మీద బస్సు ప్రయాణం చెయ్యాల్సి ఉంటుంది. బస్సులో వెళ్లటం ప్రమాదకరం అని వాళ్ల భయం. కాని ఆ అభ్యంతరం అట్టే నిలవలేదు.

అక్కడికి వెళ్లాలంటే దాదాపు ఆరు గంటల ప్రయాణం చెయ్యాలి.

అందుకే శనివారం మధ్యాహ్నం స్పెషల్ బస్సులో వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

కాని, బస్సుసమయానికి రాలేకపోవటంవల్ల, ప్రయాణం సాయంత్రం అయిదుకికానీ రాలేదు. అయిదుకి బయలుదేరితే పుష్పలోయ వెళ్లేసరికి పదకొండవుతుంది. అంటే దాదాపు అయిదు గంటల పాటు రాత్రి ప్రయాణం చెయ్యాలి.

దీనికి తీవ్ర అభ్యంతరం ఎదురయింది. రాత్రిపూట ఘాట్ రోడ్డు మీద ప్రయాణం అంటే వయస్సు మళ్లినవాళ్ళు నిజంగా భయపడ్డారు. కాని,

వంశీలాంటి యువకులు ప్రయాణం ఆపు చెయ్యడానికి ఒప్పుకోలేదు. "ఇంతదాకా వచ్చాక ఇప్పుడు కాదంటే ఎలా?" అని వాదించారు."రాత్రిపూట -అందులో ఆ రోజు పున్నమిరాత్రి - ఘాట్ రోడ్‌మీద ప్రయాణం ఒక గొప్ప థ్రిల్. థ్రిల్ లేని జీవితం అనవసరం" అన్నారు. కుర్రాఫీసరు కూడా ఒప్పుకున్నాడు. కాని బస్సు బయలుదేరే ముందు మాత్రం డ్రయివరుని పిల్చి చెప్పాడు చాలా జాగ్రత్తగా నడపమని. ఇలాంటి ప్రయాణాలు తనకు బాగా అలవాటేనని, భయపడాల్సిన పని లేదనీ హామీ యిచ్చాడు డ్రయివరు.

ఒకమారు బస్సంతా చూసాడు వంశీ.

అయిదారుగురు తప్ప మిగతా అందరూ నిద్రపోతున్నారు.

కొంచెం ప్రక్కగాచూసాడు. ఆ ప్రక్కన కిటికీ దగ్గరగా కూర్చుని సన్నగా విజిల్ వేస్కుంటూ మధ్య మధ్యలో సుమ వైపు చూస్తున్నాడు - జనార్దన్.

కోపంగా పళ్ళు కొరుక్కున్నాడు వంశీ.

అతనూ వంశీ ఇంచుమించు ఒకేసారి ఆఫీసులో జాయినయ్యారు. సుమ రాక మునుపు ఇద్దరి మధ్యా అంతంత మాత్రంగా ఉండే స్నేహం, ఆమె రాకతో పోయి, ఆ స్థానే వైరంవచ్చింది. ఒకరికొకరు 'కాంపిటీషన్'లా ఫీలవసారు. ఎవరికివారే ఆమెకు దగ్గరవ్వాలని తాపత్రయపడటం వారిద్దరిమధ్యా ఆ భావాన్ని తెచ్చింది.

ఇద్దరి ఆలోచనలూ సుమ గూర్చే ఉన్నాయి.

అయితే ఆమె ఏం ఆలోచిస్తుందో చెప్పటం కష్టం.

కిటికీ తలుపు తెరచే ఉంచిందామె. అసలే ఘాట్‌రోడ్డు. గాలి ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది.

వెన్నెల సర్వత్రా వ్యాపించియున్నది.

డ్రైవరు ఏకాగ్రతతో బస్సు నడుపుతున్నాడు.

రెండు సీట్ల వెనకాల ఆఫీసరు - భార్య చెవిలో, వంగి ఏదో చెప్తున్నాడు. ఆమె నవ్వుతోంది.

వెనక సీటులో పెద్దాయన కిటికీ తలుపు వేసేసి తలకు మఫ్లర్లు చుట్టుకొని నిద్రపోతున్నాడు.

సుమ ప్రక్కావిడ ఏదో నవల చదువుకుంటోంది.

మాయ

సుమ బయటకు చూస్తోంది. వెన్నెల వెల్లువామె ముఖముపై పడి ఒక వింత అందాన్ని సంతరించుకుంటున్నాయి.

వంశీఆమె వైపు ముగ్ధుడై చూస్తున్నాడు.

క్షపాకరుడు వెన్నెల సోనలను కురిపిస్తున్నాడు. సర్వ ప్రకృతీ ఆ వెన్నెలలో తనిసి తదేకధ్యానమై తారాశశాంకుల ప్రణయ లీలలకు సాక్షిగాఉన్నదా యనునట్టుంది. ప్రతి పూవు, ప్రతి రెమ్మ, ప్రతి కొమ్మ, వెన్నెల స్నాతమై ఒక దివ్యానుభూతిలో తేలియాడుతున్నట్టుగా సుమనోహరంగా ఉంది ప్రకృతి.

ఒక వెన్నెల కిరణం ఆమెఅధరోష్ఠంపై పడి ఎరుపుదనాన్ని సంతరించుకుంది. ఊగే జూకా - గాలికి కదలాడే ముంగురులు - ఎగరే చేలాంచలము.

ఆ 'అలేఖ్యతనూవిలాసి'ని చూస్తూ ఉంటే వంశీ మనస్సు అననుభూతమైన ఒక అనుభూతికి లోనవుతోంది. అతని మనస్సున ఒకానొక భావం కలుగుతోంది. అది ప్రేమో- మోహమో- కామమో.

సీటు మధ్య నుంచి కనపడుతున్న ఆమె నడుము వంపుమీద పడింౘాతని దృష్టి. అతని మనస్సు కోర్కెల సంద్రమైంది.

దృష్టి పైకి ప్రసరించింది.

'చక్షురుత్సవాలు చన్నుదోయి'.

అతను చేయి నలుపుకున్నాడు. "ఒక్కసారి -"

"ఆమెమీద అతనికున్నది కేవలం కామమేనను కుంటే పొరపాటు. అతనామెను నిజంగా ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాడు. నిద్రాహార భయ మైధునాలు సహజాలు, కోర్కెయూ సహజమే.

"ఒక్కసారి - ఆమె తనూలత నన్నల్లుకొని ఉంటే-" అతని ఒళ్ళు వేడెక్కింది.

కిటికీలోంచి విసురుగా వచ్చిన గాలికి ఆమె పైట తొలగిపోయింది.

అతని గుండె వేగం హెచ్చింది.

బస్సు మలుపు తిరుగుతోంది.

ఆమె పైట సరిచేసుకుంటోంది.

"ఆమె అధర సుధారసాన్ని గ్రోలి, ఆమె సౌందర్యాన్ని తనివితీరగా మనసారగా, అనుభవించి-" వంశీ ఆలోచనలు సాగిపోతున్నాయి.

ఎదురుగా వచ్చే లారీ - డ్రైవరు కళ్లల్లో నిద్రమైకం.

"అలసిపోయి, సొలసిపోయి, మధురమైన కోర్కె మరలా మరలా-" డ్రైవరు కళ్లలో ఖంగారు - తిరిగిన చేయి - పడ.. బ్రేకు - ఢీకొన్న వాహనాలు చేసిన విస్ఫోటనం-

"అమ్మా-"

★ ★ ★ ★ ★

కీచురాళ్ళు చేసే శబ్దం తప్ప మిగతా అంతా నిశ్శబ్దంగా ఉంది. చలిగాలి శరీరాన్ని తాకితే ప్రాణం పోయినంత బాధ కల్గుతోంది.

వెన్నెల నిశ్శబ్దంగా కురుస్తోంది.

తల త్రిప్పబోయాడు వంశీ. ఎక్కడో కలుక్కుమంది. విపరీతంగా దాహం వేస్తోంది. చలి రక్తాన్ని గడ్డ కట్టించేలా ఉంది. ఎక్కడా ఏ రకమైన మూల్గులూ విన్పించట్లేదు. బహుశా ఇంకెవ్వరూ బ్రతికి లేరేమో.

పైకి లేవబోయాడు వంశీ. నడుం దగ్గర విరిగినట్టనిపించింది.

ఆ బాధకు మరొక పది నిమిషాలు అలాగే ఉండిపోయాడు. ఈ మాటు కాలు కదపబోయాడు. కొంచెం కదిలింది. చెయ్యి మెల్లగా కదల్చి చుట్టూ తడిమాడు. ఎవరో తగిలారు.

బలహీనంగా తలత్రిప్పి ప్రక్కకు చూశాడు.

వెన్నెల వెలుగు ఎక్కువైంది ఇందాకల కన్న.

స్పష్టంగా కన్పించిందా ఆకారం.

తలపైన పెద్ద గాయం - గడ్డ కట్టుకొనిపోయిన రక్తం

జనార్దన్ - విగతజీవుడు.

అసూయా కోపములారా! ఎక్కడున్నారు?

దూరంగా కన్పించారు అక్కడక్కడా విసిరేసినట్టుగా పడివున్న మిగతావాళ్ళు ఆఫీసరు, భార్య ఒక చోట పడిపోయి ఉన్నారు. వారి చుట్టూ రక్తం మడుగులా ఉంది.

దాహం.

దాహం విపరీతంగావేస్తోంది. "నీళ్ళు - నీళ్ళు కావాలి". ఇంతలో ఇంకో బాధ - నొప్పి, వెన్నెముక మధ్య నుంచి.

"అమ్మా -" మూల్గాడతను.

ఇంతలో ఏదో ఆలోచన వచ్చింది.

"అవును సుమ - సుమ ఏదీ?"

చూసాడు పరీక్షగా. ఎక్కడా కనబళ్లేదు. ఈ మాటు తలని కుడి వైపుకి త్రిప్పి చూశాడు.

తల పక్కకు త్రిప్పగానే కనబడిందామె. వంశీకి కొంచెం దూరంలో నే పడి ఉందామె. ఆమె వంటిమీద ఎటువంటి గాయం కనబళ్లేదు. నిద్రపోతున్నట్టుగా ఉంది.

"సుమా!" ఓపిక తెచ్చుకుని పిల్చాడు నెమ్మదిగా. అతని పిలుపు కీచురాళ్ల శబ్దంలో కలసిపోయింది.

"సుమా" ఈమాటు ఇంకొంచెం గట్టిగా



పిల్చాడు. సమాధానం రాలేదు.

అతని దృష్టి ఆమె కటికుచో ద్వృత్తి మీద లేదు. అధరంమీద లేదు. మూసికొని వున్న ఆమె కన్నుల మీద ఉంది. ఎక్కడో ఆశ- ఆ కన్నులు తన పిలుపుకు కదుల్తాయని.

"సుమా" మరలా పిల్చాడు. ఇంకొంచెం కురిసిన వెన్నెలలో అతని పిలుపు దాగిపోయింది. ఆమె ముఖం వైపే చూస్తున్న అతని కళ్లకి ఈమాటు కన్పించాయి. వెన్నెలలో స్పష్టంగా - చీమలు. ఒకటొకటి చేరుతున్నాయి.

అర్థమైందతనికి.

"సుమా!" తీగ తెగిన వీణలా పిల్చింది మూగ గొంతు.

కన్నుల నశ్రు బిందువులెన్ని జన్మమ్ముల బంధమ్ము చూపునో!

"దాహం".

నాలిక తడుపుకున్నాడు. నీళ్లు కావాలి. కొంచెం తల పైకెత్తి చుట్టూ చూశాడు. నరసంచారం కనబళ్లేదు.

తలక్రిందకు దించుతూంటే అతని దృష్టి మరల ఆమెమీద పడింది.

దుఃఖం. దాహం - నొప్పి.

అతనికి హఠాత్తుగా ఒక విషయం బోధపడింది. ఏవో లోకపు తలుపులు తెరచుకున్నట్లుగా అన్పించింది. ఏవో ఆలోచనల కిరణాలు తనపై పడ్డట్లయ్యింది.

అతనికి తెలియకుండగనే అతని ఇరవై నాలుగేళ్ళ మనస్సు ఒక క్రొత్త విషయాన్ని ఆలోచించడం మొదలు పెట్టింది. చుట్టూ శవాలు- దూరంగా బస్సు, లారీ - రక్తం వాసన- కీచురాళ్ళ శబ్దాలు- వెన్నెల- మధ్యన ఉన్న అతనికి ఏదో జ్ఞాన చక్షువు వచ్చినట్లు అన్పించింది.

"తనకి ముందు కల్గిన ఆలోచన - నొప్పి, బాధ, దాహం- అప్పుడే సుమ, తనసుమ, తనదనుకున్న సుమ. కాని ముందుగా ఆమె గుర్తుకు రాలేదు.

రాలేదు కాదు- రాదు."

హఠాత్తుగా అన్పించిందతనికి "తనిప్పుడు చచ్చిపోతే- అవును చచ్చిపోతే ఏమవుతుంది?"

మాయ

వంశీ ఇంకొకటి గుర్తించాడు - భయం. మొదటిసారిగా మృత్యువు గూర్చిన ఆలోచన వచ్చినప్పుడు భయం.

"తనుపోతే ఆమె దగ్గరకు చేరుకుంటాడా? ఇప్పుడామెకాదు ఆమె ఆత్మ ఎక్కడుంటుంది? ఇక్కడ చుట్టూ తిరుగుతూనా? నేను చచ్చిపోతే- నేనూ అలాగేనా?"

వెన్నెముక ఝరేల్ మంది.

నొప్పి.

క్షణంలో వెయ్యి ఆలోచనలు.

ఆమె మీద పడింది అతని దృష్టి.

ముణుకులను దాటిపైకి చెదరిపోయిన చీర, పరికిణీ. వెన్నెల ఆమె కాళ్ళపై, తొడలపై నిర్జీవంగా ప్రతిఫలిస్తోంది. నడుం ఒంపు మీద పడిన వెన్నెల- తొలగి పోయిన పైట-

చూపు త్రిప్పుకున్నాడతను.

"తను, తనేనా? కొద్ది సేపటి క్రితంవరకూ ఆమె శరీరంలోని అంగాగాలని తమకంతో కోరికతో, మోహంతో చూచిన తనేనా చూపుత్రిప్పుకున్నది? ఇప్పుడు- ఛీ.

ఎందుకని?

"జీవం"- అవును జీవం. ఆమె ఇప్పుడు విగతజీవి. తను కూడా విగతజీవుడైతే, తన ముఖం మీదకు చీమలు వచ్చి-"

అతని ఒళ్లు జలదరించింది.

అపరిమిత భావపరీవ్యాప్తుడై, సర్వమునందున జుగుప్సా సంకలిత మనస్కుడై, చేతనా చేతనావస్థల కలిగి- స్పృహ తప్పి పోయాడతను.

వెన్నెల కురుస్తోంది.

* * * *

తెల్లవారింది.

రాత్రి జరిగిన విషాదం పోతసూర్యునికి తెలియ జెప్పాలని ప్రకృతి మేల్కొంటోంది.

నడుస్తున్న ఆ కోయ యువతి, ఎదురుగా కన్పించిన దృశ్యం చూసి భయవిహ్వలయై చప్పున ఆగిపోయింది.

బస్సు లారీ చెరో వైపూ పడి ఉన్నాయి. మధ్యన ఎంత మంది ఒకరా? ఇద్దరా? పాతిక ముప్పై మంది- నిర్జీవంగా.

మడుగుకట్టిన రక్తం గడ్డ కట్టుకొని పోయి, చూడ్డానికి కళ్ళు తిరిగేలా ఉంది.

ఆ కోయ యువతి, గూడేనికి వెళ్ళి విషయం చెప్పాలని పరిగెత్తబోయి ఏదో అనుమానం వచ్చి ఆగిపోయింది.

ఎక్కణ్నుంచో వస్తోంది- ఒక సన్నటి మూలుగు.

ఆమె సందేహంతో ఆగి పోయింది.

మళ్లీ విన్పించిందా మూలుగు. చప్పున ఆ వైపుకు పరుగెత్తిందామె.

చుట్టూ శవాలు- మధ్యన పడి ఉన్నాడతను..

కదలలేక పోతున్నాడు. అతి కష్టం మీద నోట్లోంచి మూలుగు వస్తోంది.

ఆమె ఒక్క ఉదుటున పరుగెత్తింది.

దగ్గరే ఉందొక చిన్న వాగు.. ఆమె గభాల్న దోసిలితో నీళ్లు తెచ్చి అతని ముఖంమీద చిలకరించింది.

"దాహం"- మూల్గాడతను.

మళ్ళీ వెనక్కు పరుగెత్తిందామె. ఈ మాటు నీళ్ళు కొంచెం జాగ్రత్తగా తెచ్చి అతని నోట్లో పోసింది.

ఆత్రంగా తాగాడతను.

తన పైట తీసి అతని ముఖం తుడిచిందామె.

కళ్ళు తెరచాడు వంశీ.

"నేను ఉన్నాను- నేను ఉన్నాను. నేను చనిపోలేదు. బ్రతికే ఉన్నాను."

కోయ యువతి, అతను కళ్ళు తెరవడం చూసి ఆనందంతో చిన్నగా అర్చి, మళ్ళీ వెళ్ళి కొంచెం నీటిని తెచ్చి అతని ప్రక్కన మోకాళ్ళ మీద కూర్చుని, అతని నోట్లో నీళ్ళు పోయడాన్కి ముందుకు వంగింది.

వంశీ చూపు ఆమె మీద పడింది.

ఆమె వంగింది.

అప్రయత్నంగా, అసంకల్పంగా అతని చూపు ఆమె వక్షోజాల మీద పడింది. సన్నని కంచుక దాచలేని కోయ యువతి నిండు గుండెలు.

అతనికి తెలియకుండగనే, అతనిలో ఒక ఆలోచన.

పెదాలు తడుపుకున్నాడతను, "ఒక్కసారి-"

సుఖము కొరకు కోరిక జనించును. కోరిక నుండియే విరక్తి కలుగును. విరక్తి నుండి మరల కోరిక జనించును. ఇది యొక మాయ. □

ఇంకా పొడుగు ఎదగండి

2'' – 8''

నూతన శాస్త్ర పద్ధతులలో వ్యాయామములతో ఎక్కువ పొడుగుకండి. ఆరోగ్యవంతులు అవండి. స్త్రీ పురుషులకు ఎల్లరకు అనువైనది. దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి ఎంతమాత్రం లేదు. వివరములకు హిందీలోగాని తెలుగులోగాని ఉచితం.

NEW C.T. HOSPITAL

806, Dr. Mukerjee Nagar, Delhi-9.

తెల్ల వెంట్రుకలు నల్లపర్చును

మేము యెక్కువగా ప్రశంశించదలచలేదు. మా ఆయుర్వేదక తైలము తెల్లవెంట్రుకలను కుదుళ్లనుంచి నల్లబర్చి, తెల్లవెంట్రుకలు రాకుండా అరికట్టును. మెదడుకు, కళ్లకు పుష్టిని కలిగించును. మందు గుణం ముందు ధర ఆలోచించదగినది కాదు. పూర్తి కోర్సుకు, పోస్టేజి, ప్యాకింగ్ ఖర్చులు లేకుండా రు. 41/– మీ అడ్రసు ఇంగ్లీషులోనే వ్రాయండి.

SUNITA AYURVED BHAVEN,

P.O.-LALBIGHA (GAYA) [A.D.]

తెల్ల మచ్చలు

మా మందు వాడిన 36 గంటల తర్వాత మచ్చరంగు మారడం ప్రారంభించి త్వరలోనే అసలు చర్మపురంగుకు మారును మీ వ్యాధి గూర్చిన పూర్తి వివారాలు వ్రాసి వైద్యం పొందుటకు రు. 50/- మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

JUGAL KISHOR VAID

[No. 55] P. O. Katri Sarai

[Gaya] Pin : 805105